# తాపీమేస్త్రీ రామదీక్షితులు బి. ఏ.

## శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

ఇద్దరూ గోదావరియొడ్డున తారసిల్లారు.

"మీ దేవూ రండీ ?" అనడిగింది, నల్లటావిడ.

"కోనసీమ" అని బదులుచెప్పి "మరి మీదే పూరండీ" అని యెదురడిగింది, యెర్రటావిడ.

"జల్లిసీమ"

"మీ పేరు ?"

"రత్తమ్మ"

"వైదీకులా"

"అవును, మీ పేరు ?"

"సుందరమ్మ"

"నియోగులా ?"

"కాదు, వైదీకులమే"

అప్పటి కిద్దరూ కత్తిరినొడ్డు దిగారు.

"మీరిక్కడ యెందు కున్నారూ ?" అనడిగింది రత్తమ్మ.

"మా అబ్బాయి వుద్యోగంకోసం వచ్చాం"

"దొరికిందా ?"

"ఇంకాలేదు"

"ఎన్నాళ్ళయింది మీరు వచ్చి ?"

"నిన్ననేనండీ! మీ రెందుకువచ్చారూ ?"

"మేమూ మా అబ్బాయీ వుద్యోగంకోసమే, నిన్ననే వచ్చాం. అయితే, మీకిల్లు దొరికిందా ?

"ఆ, దొరికింది. మట్లగదీ, దానికి చేరివున్న మూడుగజాల వసారాయిచ్చా రెనిమిది రూపాయలు కట్టి."

"మాకూ దొరికింది. స్నానాలగదీ, పుడకలూ పిడకలూ పెట్టుకునే పంచపాళీ ఆరు రూపాయల కిచ్చారు"

సుందరమ్మ బుగ్గలు నొక్కుకుంది, గాజులు గలగలలాడేటట్లు చెయ్యి కొంచెం వూపుతుంటూ.

గాజులు గలగలా ఆడాయి, మిలమిలా మెరిశాయి, అవి చూసి రత్తమ్మ కళ్లు జిలజిలా మన్నాయి.

"నాలుగు జతల బంగారుగాజులు. ఇంకా యెన్ని నగ లున్నాయో ? పెట్టిపుట్టింది" అనుకుం దామె.

చివరి కామె "మీ కెంతమందండీ పిల్లకాయలూ?" అనడిగింది.

"ఇద్దరు కొడుకులూ నేనూను, పెద్దబ్బాయి బి. ఏ. అతని వుద్యోగంకోసమే వచ్చాం. చిన్నబ్బాయికి తొమ్మిదో యేడు"

"నాకొక్క కొడుకైనా కలుగలేదూ" అంటూ అనుకుంది రత్తమ్మ.

"మా అబ్బాయి కూడా బి. ఏ. ప్యాసని సెక్కల మీద సంతకడానికే మేము వచ్చాం. మా అమ్మాయికి పదోయేడు వెళుతుంది రేపు కార్తీకపున్నమకి."

ఇది వింటూనే, మెడ బిగిసిపోతున్నట్లు నటిస్తూ సుందరమ్మ పైట కొంచెం సడలించుకుంది.

దాంతో, మెడకింది పట్టె కొంచెం కనిపించింది. వెంటనే రెండుపేటల గోవర్ధనంగొలుసు ధగధగ్ జిగాల్ అంది.

అది చూసి రత్తమ్మ చలిత అయింది.

అది గుర్తించి సుందరమ్మ గర్వించి వెన్నువిరుచుకుంది.

"మీ అబ్బాయికి పెళ్ళయిందా ?" అనడిగింది రత్తమ్మ.

"ఆ, పదహారేళ్లు నిండకుండానే అయింది పెళ్ళి, కోడలి కిప్పుడు మూడోనెల కూడానూ."

“బాగుంది. ఉద్యోగస్థు డయేటప్పటికి కొడుకు పుడతాడు. అదృష్టవంతుడు”

“మరి మీ అబ్బాయికి పెళ్ళి—”

“ఇంకా చెయ్యలేదండీ!”

“చెయ్యలే దంటే—”

“ఆదిలో, బి. ఏ. అయితే గాని పెళ్ళిచెయ్యనని తండ్రి వ్రతంపట్టారు.” ఉద్యోగం దొరికేదాకా పెళ్ళి వద్దని నా నాయనే పట్టుపట్టుకూర్చున్నాడు తరవాత”

“కాకపోయినా పెళ్ళిచెయ్యడం మాటలా?” అంది సుందరమ్మ, కళ్లు తిప్పుకుంటూనూ, తనచేతి రాళ్ళవుంగరం చూసుకుంటూనూ.

ఆవుంగరమున్నూ చూసింది రత్తమ్మ.

“ఒక్కజత అయినా నాకు బంగారుగాజులు చేయించాలనీ, తమ కిలాంటి వుంగరం చేయించుకోవాలనీ యెంతో ముచ్చటపడేవారు నామహారాజు” అనిన్నీ అనుకుం దామె.

అప్పటి కిద్దరూ రేవు చేసుకున్నారు.

రత్తమ్మ, బిందెలో వున్న బట్టలుతీసి, తడిపి రాతిమీద పడేసి, చేతికి నీళ్ళందేటట్టు కూచుని బిందె తోమసాగింది.

సుందరమ్మ, బిందె బోర్లించి దానిమీద కూచుని “మీ కేమన్నా భూమీ పుట్రా—” అంటూ మాట తేల్చేసింది.

“భూములు నాడే లేవు. కొంప తెగనమ్మి నాయనకి చదువుచెప్పించాను నేను” అని బదులుచెప్పింది రత్తమ్మ.

“మా కేమాత్రమో వున్నాయిసుమండీ! అయితే మాత్రం కూచుని తినమా? అంచేత వచ్చాం, మేము ఉద్యోగంకోసం” అనిచెప్పి సుందరమ్మ, మొగం పక్కకి తిప్పుకుని కళ్లు చికిలించుకుంది.

క్షణంలో మళ్ళీ యిలా చూస్తూ “మీ కెన్నాళ్ళయిందీ ఈయోగం పట్టీ?” అని కూడా అడిగింది.

“మూడే ళ్లయిందండీ! కలరావచ్చి యెత్తుకుపోయింది నాకేవృణ్ణి. ప్రయివేట్లు చెప్పి పోషించేవారు మమ్మల్ని”

“నాకూ మూడేళ్లే అయింది. ఆసుపత్రి మింగేసిందాయన్ని”

అప్పటికి బిందె తోమడం అయిపోగా, రత్తమ్మ, తనపంచా, తన కొడుకు పంచా, కూతురు పరికిణీ వుతకసాగింది.

వెంటనే సుందరమ్మ రెండుచేతులతోనూ నీళ్లు చిమ్ముకుంటూ “బాబోయ్ బాబోయ్” అని యెగిసెగిసిపడుతూ మొలలోతుకి వెళ్లి నుంచుని! “అబ్బ! చలిచలి! వేన్నీళ్లేగాని యెరగనైతిని నిన్నటిదాకా” అంటూ కంఠందాకా మునిగి లేచి వొళ్లు తోముకోసాగింది.

౨

ఎలెక్ట్రిక్కు కాన్పోరేషను దగ్గిర యెదురుపడి సినిమాకేనా వెడుతున్నారు?” అనడిగింది సుందరమ్మ.

అప్పుడే విప్పిన గ్లాస్గోమల్లు మడత కట్టుకుని, తల చక్కగా దువ్వుకుని జారుముడి వేసుకుని వుందామె.

రత్తమ్మ కట్టుకున్నదిన్నీ చాలా పరిశుభ్రంగా వుంది; కాని అది నీరుకావిపంచె.

ఆమె కూడా తల దువ్వుకుని జారుముడి వేసుకునే వుంది.

“కాదండీ! నేనున్న విద్యమానంలో నాకు సినిమా కూడానా? మార్కండేయస్వామి గుడికి వెడుతున్నాను”

“మీ అబ్బాయి కేమయినా వుద్యోగం—”

ఇంకా దొరకలేదండీ! ఉద్యోగం ఆశ వొదులుకున్నాడు నాసాయన. మరి మీ అబ్బాయికి దొరికిందా?”

"ఎందరెందరో యిస్తాం రమ్మన్నారు; కాని మావాడే వొప్పుకోలేదు"

"అదేం ?"

"దిక్కుమాలిన వుద్యోగాలు కొన్ని-ఈవుద్యోగా లిచ్చేవాళ్లకి అవసరమే కాని బుద్ధి వున్నట్టులేదండీ!"

"ఏం జరిగిం దేమిటి ?"

"ఒక జమీందారన్నాట్ట, ఇచ్చేది పదిహేను రూపాయలట యింతా చేస్తే, కాని రాత్రింబగళ్లు తనని కనిపెట్టుకునివుండాలట. చుట్టలూ, సిగరెట్టులూ నోటి కందిస్తూ. పైగా, సంవత్సరం దాకా జీతం యెక్కువ చెయ్య మని అడగ ననీ, నౌకరీ చేస్తా నని రాసి కూడా యివ్వాలి టండోయ్"

"ఆయనే కాబోలు, నానాయనతోనూ అలాగే అన్నాట్ట"

"ఇంకో వర్తకు డున్నాట్ట. కొనైతే యిరవయి రూపాయ లిస్తాడుట లెండి; అయితే, నెల కిరవై దినాలు సికిందరాబాదనీ, శ్రీకాకుళం అనీ, బందరనీ తిరుగుతూ వుండాలట. ఊళ్లో వుండిన పది దినాలూ తన యింటోకూచుని వుత్తరాలకి నకళ్లు రాయాలట, విన్నారా ?"

"నా నాయనతో అటు కర్నూలు దాకానూ, యిటు భద్రాచలంపైకీ కూడా వెడుతూవుండాల న్నాట్ట ఆయనే కాబోలు"

"మరో పెద్ద ఆస్తిపరు డున్నాట్టండీ !" వడ్డీ కట్టడం చేతవునా ?" అనడిగాడుట. బి. ఏ. ని అదా అడగడం చెప్పండీ, పోయేకాలం కాకపోతే? తీరా, అందు కయినా సరే అని సిద్ధపడితే—"

"జీతం లేకుండా మూడుమాసాలు పనిచెయ్యా లన్నమాటేనా మీరు చెబుతున్నది ?"

"మీ అబ్బాయికే అయిందీ అదీ ?"

"ఆ"

"ఇంకోటి కూడా అన్నట్టు మీ అబ్బాయితో అన్నాడో లేదో మరి. తన కొడుక్కి తన మనమ డికీ యింగ్లీషు కూడా చెప్పాలటండీ"

"అదెందుకో తెలుసా ?"

"వాళ్లకింగ్లీషు తెలిస్తే గాని, యింగ్లీషు గుమాస్తా లెందుకంటారుట, చూశారా ?"

"డబ్బున్నవాళ్లెన్ని చిలకపలుకు లయినా పలుకు తారు, మానేం చెయ్యగలము ?"

"మానేం చెయ్యగలమా? వాళ్లకే గండా మహా? ఊరికే కూచోడం యెందు కని గాని—మాయింట్లో కాఫీఖర్చుకి చాలదు వా డిస్తానన్నది"

మీమాట యేమోగాని నాకు మాత్రం అది కొన్నాళ్లపాటు మహా మేరు గనుపుండేది; కాని రాత్రిళ్లు తరుచు తన యింటిదగ్గర పడుకోడం కూడా తప్పదన్నాట్ట కాదూ?"

"మరేటండోయ్! కళ్లూ, కాళ్లూ వున్నతాయా ఆ అబ్బికి? బ్రాహ్మణపిల్లాగా, బి. ఏ., తన యింటికి కాపలా ?"

"అలా వుంది కాలం"

"ఎవరో సినిమావాళ్లుటండీ! రాత్రి వొంటిగంట దాకా రెండాటలకీ కథ చెప్పా లన్నారుట. పొడి కలు పుచ్చుకుని కుర్రాళ్లు కొత్తవీధికి తిరుగుతున్నారో లేదో చూడడానికి మధ్యాహ్నంపూట అంతా వాళ్ల వెనకవెనకనే తిరుగుతూ కూడా వుండాలిట. మరి జీతం—"

"ఇరవయ్యేగా ?"

"మీ అబ్బాయి వెళ్లాడూ అక్కడికి ?"

"వెళ్లాడమ్మా, వెళ్లాడు"

"ఒకప్లీడరుట. తన కొడుకులకి రాత్రీ పగలూ ప్రయివేటు చెబితే అన్నమూ బట్టా యిస్తాట్ట. తనకే కాని మరెవరికీ కుటుంబం లేదనుకున్నాడు కామోసు వెర్రినాయన"

# తాపీమేస్త్రీ రామదీక్షితులు బి. ఏ.

"ఆయనే కాబోలు, మావాడికి జీతమే కావాలంటే పదిహేనురూపాయ లిస్తా నన్నాట్ట; కాని, తనకోసం కోర్టుకి కాఫీ పట్టుకువెడుతూవుండాలిట"

"బ్రాహ్మణజన్మేనా ? వాడిదీ ?"

"......................."

"నవ్వుకుని వూరుకుంటే కాదండీ ! ఇలాంటి వాళ్లకి తగినట్టి గడ్డిపెట్టకపోతే యింకా పెచ్చిపోతారండీ !"

"ఎవరో వొకరు పెట్టకపోరు, మనకెందుకూ ?"

"ఇంకో వర్తకు డున్నాట్ట బ్రాహ్మడేట. కొత్తగా కూరల అంగడిపెట్టాడుటండీ ! ఊళ్లో యింటింటికీ తిరిగి కూరలు కొనుక్కునేవాళ్ల నందర్నీ తన అంగడికి మళ్లించాలట. అలా మళ్లిస్తే—ఆవచ్చినవాళ్లు తన పేరు చెబితే—వాళ్లు కొన్నసరుకులమీద వచ్చే లాభంలో నూటి కయిదురూపాయాలు—"

"కావడి యిజానవేసుకుని వూళ్లో తిరిగి అమ్ముకురావాలనలేదు, నయమే కాదూ ?"

"బాగా చెప్పారు. మరి మీ అబ్బాయి యేమి చేశాడూ ?"

"ఏటి కడ్డపడ్డాడండీ !"

"అంటే ?"

"ఆదిలో, దినాని కొక రూపాయి కిడుతుందనుకున్నాట్ట కాని వొకవారం అయింది ప్రవేశించి, పదిరూపాయలు వచ్చా యంటూ పొంగిపోతూ పట్టుకువచ్చాడు నా నాయన"

"మా వాడు చిల్లరపనులు చెయ్యడు సుమండీ !. పుట్టింది బ్రాహ్మణపుట్టుకాయె. ఆపైని బి. ఏ. మాకు లోటూ లేదు. మంచిపనిదొరికితే నే"

"మీ కేమమ్మా బంగారు పిచికలు. మరి వెడుతా స్వామిదదర్శనం చేసుకుని, నా నాయన యింటికి వచ్చేటప్పటికి వంటచెయ్యాలి"

"నేనూ వెళ్లాలి, ఆలస్యం అయితే టిక్కెట్లు దొరుకుతాయో లేదో, ఏదో కొత్తఫిలిం వచ్చిందిట. ఇక అవి ఫేషన్లు కావుట, పాటలు కావుట, డాన్సులు కావుట—బాబోయ్........"

## 3

ఇద్దరూ మార్కండేయస్వామి గుడిసమీపాన కలుసుకున్నారు.

"గుడినుంచి వస్తున్నారా ?" అనడిగింది రత్తమ్మ.

"లేదండీ, బజారుకి వెళ్ళాను గ్లాస్గోతానులు రెండో మూడో పుచ్చుకుందా మని. రేపు రమ్మన్నాడు వర్తకుడు. ఇలా తిప్పడమే కాదు, వొకటికంటే యెక్కువ యివ్వడుట. ఇకముందు దొరకడమే కష్టంట"

"ధర పెరిగిపోయినందుకే గోలగా వుండగా అదికూడానా ?"

"ఏమి చెప్పకోనండీ ! ఆదికాలాన నేను మధుర చీరలూ, బెంగుళూరుచీరలూ, కంచిచీరలూ, పుల్లంపేటచీరలూ, ఉప్పాడచీరలూ తప్ప మరొకటి యెరుగను. ఈయోగంపట్టాక కొన్నాళ్ళనుంచి గ్లాస్గోనుల్లు కడుతున్నాను, ఇకముందెలాగో మరి"

"చిక్కగానే వుండేటట్టుంది. వద్దువద్దంటూ వుంటే, నిన్న, చెల్లెలికి నాలుగు పరికిణీగుడ్డలూ, నాలుగుచొక్కాగుడ్డలూ, నాకు మూడు మెట్టూరు మల్లుపంచెలూ తెచ్చిపడేశాడు నా నాయన. ముందు ముందు మీరన్నట్టు దొరకడం కష్టమేట"

"బాగా కిడుతోంది కామోసునేం ?"

"ఆ, స్వామిదయవల్ల చెప్పవద్దూ! రెండువారాల నుంచి నా నాయన దినానికి రెండున్నర సంపాదిస్తున్నాడు"

"దినానికి రెండున్నర తెస్తున్నా డంటే జ్ఞాపకం వచ్చింది, విన్నారా ? ఎవరో బ్రాహ్మణపిల్లాడుటండీ ! బి. ఏ. కూడానుటండీ! కాని శూద్రకుర్రాడు

లాగ తాపీపని చేస్తున్నాడుటండీ! మావాడు చెప్పి యేంతో యిదయాడు, అదేం కర్మమండీ ?"

"............అయితేనూ, మీచేతిని గాజులు రెండుజతలే కనపడతాయేం, నాలుగుజతలుండేవి కాదూ ?"

"అవును, వుండేవి నిజమే—ఇప్పుడూ వున్నాయి; కాని, బరువనీ దినమ్మా యెందు కని రెండుజతలే పెట్టుకుంటున్నాను"

ఇలా అంటూ సుందరమ్మ పైటచెంగు కంఠం చుట్టూ సవరించుకుంది.

దాంతో, ఆదొంగతనం కనిపెట్టేసి, రత్తమ్మ "అదేం, గోవర్ధనంగొలుసేదీ ?" అనడిగేసింది.

"సరదాపడితే మాచిన్నబ్బాయి మెడలో వేసి వచ్చాను" అని బదులుచెప్పింది సుందరమ్మ, మొగం వంచుకుని.

"మీ అబ్బాయికి వుద్యోగం—"

చెప్పు లరిగేలాగ—చెప్పు లంటే బూడ్సులు సుమండీ! అవి అరిగేలాగ తిరుగుతున్నాడు. కొలువులు కావలసినన్ని వున్నాయిట; కాని వొక్కటీ దర్జా అయింది కాదుట. చూసిచూసి పాడుపనిలో ప్రవేశించడం యెలాగండీ మరీ ?"

"మనస్కరించకపోతే యెలాగా ప్రవేశించడం?"

"కానయితే రెండునెలలు కావస్తోంది వచ్చి అయినా—"

"కష్టమే. ఉప్పుతో తొమ్మిదీ కొనుక్కోవాలి డబ్బుపెట్టి. అయినా, వొక్కటీ మంచిది దొరకదు. నెయ్యీ మజ్జిగా పోస్తున్నారా ?"

"బాధగానే వుందండీ"

"మీకోడలికి గాజులు పెట్టించారా ?"

"అయిదోమాసం రేపటితో వెడుతుంది. చెప్పకో గూడదు; కాని విన్నారా ? సంతోషం కొద్దీ నెల తప్పగానే రాశాం, వెంటనే వచ్చి పుట్టింటివారు తీసుకుచక్కాపోయారు. గాజులు వారే పెట్టించు కుంటా రనుకున్నాం. ఎంత గతి కడుక్కుపోయినా గాజులు పెట్టించడం పుట్టింటివారే—అవునంటారా కాదంటారా ?"

"లోకధర్మం అంతేగా ?"

"మా అబ్బాయి పెళ్ళాన్ని విడిచి క్షణం ఉండ లేడు. వారాని కోసారు వెళ్ళి వారందినా లుంటూనే వుంటాడు, మొదటే వాడితో చెప్పకోవచ్చునా ? తీరా, అయిదోనెల వెళ్ళిపోతుం దనగా, నాలుగు దినాలకిందట వాడితో చెప్పేసి వూరుకున్నాట"

"అదేం ?"

"వారికి ఆనవాయితీ లేదుట"

"పా—పం"

"పాపమో పుణ్యమో వారు చేసింది. దాని మీద మేమే పెట్టించుకున్నాం నిన్న, మాకు తప్పుతుందిటండీ ?"

"తప్పితే యెలాగా ? లాంఛనాలూ ముచ్చట్లూ యెలాగో వొకలాగ—"

"ఎలాగో వొకలాగ యేంకర్మం, రాజాగా జరిగించుకున్నాం, మాకుమాత్రం తీరవద్దుటండీ ?"

"అదే నేనన్నదీని. అయితే తల్లీతండ్రీ—"

"రానూ వచ్చారు, గాజులు పెట్టించిన ఉత్తర క్షణాన తీసుకువెళ్ళనూ తీసుకువెళ్ళారు మళ్ళీ"

"అదేమిటండీ ? ఇవాళ తీసుకువెళ్ళకూడదనూ ?"

"ఇరుగూ పొరుగూ అలాగే అడిగారు, వింటేనా ?"

"మరి మీ అబ్బాయి—"

"అయితే నేనూ వస్తాను పదండి" అంటూ వెంట పడ్డాడు. మనలో మనమాట, పెళ్ళాణ్ణి నేనే పంపించాను సుమండీ"

ఇలా అని సుందరమ్మ, ముక్కుమాత్రీ తిప్పు కుంటూ చురుగ్గా చూసింది.

"తెలిసిందికాదు, వచ్చి మీకోడల్ని చూస్తును" అంది రత్తమ్మ.

“చూద్దురుగాని, చూద్దురుగాని, మరిపోవాలి. ఇవాళ చింతామణి నాటకంట. పెందరాడే రెండు మెతుకులు నోట్లో వేసుకుని—నా చిన్నకొడుకు గంటనుంచి తొందరపెట్టేస్తున్నాడు”

ఇలా అంటూనే సుందరమ్మ తుర్రుమంది.

రత్తమ్మ, ముందు రిచ్చపడి, తరవాత మెల్లిగా గుడికి వెళ్ళింది.

౪

ఇద్దరూ మిషన్ ఆసుపత్రి ఆవరణలో యెదురు పడ్డారు.

“ఇలా వచ్చారేం?” అనడిగింది సుందరమ్మ.

“మా బంధువుల్లో వొకమ్మాయికి ర కరాక కడుపు వచ్చింది. ఎందుకయినా మంచిదని పురిటికి ఆసుపత్రికి వచ్చారు. చూసి వస్తున్నాను.”

“పురుడు వచ్చిందా?”

“ఆ, నాలుగు దినాలయింది వచ్చి, గుమ్మడి పండువంటి పిల్లాడు పుట్టాడు. పుట్టింటివారూ అత్తింటివారూ పొంగిపోతున్నారు.”

“అబ్బురమా? అయితే, అందరికీ అలాంటి పుట్టింటివారు దొరకవద్దూ?”

“కూతురుబాగు చూసి ఆనందించని పుట్టిళ్ళవాళ్ళు ఉంటారా, లోకంలో?”

“అయ్యో వెర్రిద, అడిగారూ మా వియ్యాలవారి సంగతి?”

“ఏమిటండీ?”

“ఏమిటంటే? మాకోడలికి వొళ్ళంతా నీరు పట్టింది. అక్కడి డాక్టరు భయపెట్టాడు. తీసుకు వచ్చి మాయింటిమీద పడేశాడు తండ్రి”

“పురుడు వచ్చిందా?”

“ఇంకా లేదండీ! తల్లీతండ్రీ వచ్చి మానెత్తిమీద కూచున్నారు విందులు కుడుస్తూ. కూతుర్ని కనిపెట్టుకుని తల్లీ, గోదావరిరేవు కనిపెట్టుకుని తండ్రీ కూచుంటారు. ఎక్కడో పనికిమాలిన సంబంధం వచ్చిపడింది మాకు, చచ్చిపోతున్నాను చాకిరీ చెయ్యలేక”

“మీ అబ్బాయికి వుద్యోగం—”

“ఇంకా దొరకలేదండీ! ఏమిటేమిటో వున్నాయిగాని మావాడు పెద్దమనుష్యుల దగ్గిరే కానీ—అదయినా దర్జాగా కూచుని పురమాయింపులు చేసే పెద్దగుమాస్తాపనే కానీ చెయ్యడండీ! నాలుగురాళ్ళు పైగా కూడా దొరుకుతూ వుండాలి. అలాంటిది వచ్చినప్పుడే అని చూస్తున్నాడు”

“మా కలా సాగదండీ మరి! అబ్బాయి యేటికడ్డపడ్డాడు. దినానికి మూడు రూపాయలు తెస్తున్నాడిప్పుడు. ఎవరో పెద్దరెడ్డిగారుట. పెద్దపెద్ద కంట్రాక్టులు చేస్తూవుంటారుట. నాలుగు లక్షలికి వొప్పుకుని యిప్పుడు పెద్దఆసుపత్రి కట్టిస్తున్నారుట. జీతానికి రమ్మంటున్నారట వారు, పైని వుండి పనులు చేయించడానికి నా నాయన్ని”

“కూలీలమీద మేస్త్రీపనా?”

“ఏమిటో చెప్పాడు, ఆపేరు జ్ఞాపకంలేదిప్పుడు, కానీ—నువ్విలా రా తల్లీ! ఇది నా చిట్టితల్లి. మీరు మార్కండేయస్వామి గుడిదగ్గిర కనపడ్డారూ? ఆ వేళ, మధ్యాహ్నం యెండవేళ, యెవరో వొకావిడ రెండు జతల గాజులూ, గోవర్ధనం గొలుసూ అమ్ముకుందిట బజార్లో. అప్పు డక్కడే వుండిన మా అబ్బాయి, పాతికరూపాయల లాభం యిచ్చి అవి కొనేశాడు. ఇదిగో, ఆ గాజుల జతలు చెరిపించి నా చిట్టితల్లికి రెండు జతల గాజులూ, మిగిలిన బంగారంతో చెవులికి గుద్దులూ లోలకులూ, ముక్కుకి కేసరీ ముక్కుపుడకా చేయించినాడు. గొలుసు మెరుగుపెడుతున్నాడు పనివాడు”

“డబ్బంతా యిప్పుడు కూలీలకేనండీ, యేం చేయించకా?”

“...అదేం, మీ చేతిని వుంగరమూ, తక్కిన గాజుల జతలు రెండూ కనపడవేం?”

"అలాంటివి చూస్తే యీ ఆసుపత్రివాళ్ళు డబ్బు దోచేస్తారు, అంచేత, తీసి దాచివచ్చాను"

"రాత్రి యిక్కడ పడుకోవాలి కామోసు పాపం, పాతబట్టలతో వచ్చాను"

"అవునండీ"

"కోడలి కేమయినా సుళువుగా వుందా?"

"ఏం, ఉందకా? వారంరోజులకి ఇంజక్షన్లకే తొంభై రూపాయ లయినాయి. సుళువుగానే తిరుగుతోంది, యివాళో రేపో పురుడు వస్తుందంటోంది దొరసాని"

"మంచి ముహూర్తాన పిల్లా అబ్బాయి కొమాళ్ళ తండ్రి కావాలి. మరి యింటికి వెడతానండి"

"నడుస్తూ వుండండి నేనూ వస్తాను, స్నానమూ గట్రయ్యా వచ్చారుట సావిత్రి ఆడడానికి, యిది తప్పితే మళ్ళీ యెన్నాళ్ళకో గాని దొరకదు"

రత్తమ్మ తెల్లబోయింది; కాని చేసేది లేక మంచి దండీ" అంటూ మెల్లిగా చక్కాపోయింది.

ఇద్దరూ జయాటాకీసుపక్కన, రాజకాప్రెస్సు దొడ్డిగుమ్మం దగ్గిర కలుసుకున్నారు.

రత్తమ్మ తెల్లని మల్లుపంచె కట్టుకుని వుంది, చేతులకు రెండుజతలబంగారుగాజులూ, మెడలో గోవర్ధనం గొలుసూ వున్నాయి.

ఆమె కూతురు, పువ్వులపరికిణీ గళ్ళఫ్రాకూ తొడుక్కుని వుంది. ఆమెచేతికిన్ని గాజులూ, చెవులకి గుబ్బులూ లోలకులూ, ముక్కున పేసరి ముక్కుపుడకా వున్నాయి.

సమీపాన, రత్తమ్మ కొడుకు ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

సుందరమ్మ, మాసిపోయిన పాతబట్ట కట్టుకుని వెలవెలబోతున్నట్టుంది; కాని రత్తమ్మని చూసి గాంభీర్యం తెచ్చుకుంది.

ఆమె చిన్నకొడుకు శూద్రపిల్లలతో ఆడుతూ పేచీపడుతున్నాడు.

"అదిగో, సూటువేసుకుని దొరటోపీ పెట్టుకున్నాడదూ, అతనే నండీ నా నాయన? రెడ్డిగారు నెలకి నూటయాభై రూపాయ లిస్తున్నారిప్పుడు" అంది రత్తమ్మ.

"కూలీలమీద మేస్త్రీ కంత జీతం యిస్తారా యెక్కడైనా?" అనడిగింది సుందరమ్మ, బుగ్గలు నొక్కుకుంటూనూ, కళ్లు తిప్పుకుంటూనూ.

"మేస్త్రీ కాదుగా? సూపర్వైజరన్నారుగా?"

"తాపీపనివాడి కంత పెద్దవుద్యోగం యిస్తారా యెవరయినా?"

"అంత పెద్దపని యిస్తారా" అని వింతా "అంత జీతం యిస్తారా?" అని ఆశ్చర్యమూ యెందుకూ? అది మనిషి బుద్ధినిపట్టీ తాహతునుపట్టీ, నడతని పట్టీ వుంటుంది. ఆ రెడ్డిగారి దగ్గిర వొక బ్రాహ్మణ పిల్లాడు, బి. ఏ., అటెండరుగా చేరాట్ట, ఆరు మాసాలు తిరిగితిరిగి నౌకరీకోసరక్కా, ఎవరికో ఎట్టి వేటు కొంతం యిచ్చి వివరాలు చెప్పి జవాబు త్వరగా పంపమని చెప్పి రమ్మన్నారుట రెడ్డిగారు, అంటే, ఆ బ్రాహ్మణుడు బి. ఏ., "నే నలాంటి నా మోషీ పనులు చెయ్య" నన్నాట్టండీ! అదేమిటండీ, అటెండరుగా చేరాక యిడిసిపోటు కాకపోతే?" అని బుదలకించి చురుగ్గా చూసింది రత్తమ్మ.

"ఏమో" అంది సుందరమ్మ, మొగం పక్కకి తిప్పేసుకుని.

"అప్పుడక్కడ వొక పెద్దమనిషి వున్నాట్టండీ!" అంటూ మళ్ళీ అందుకుంది రత్తమ్మ, మరి కాస్త దగ్గిరికి వెళ్ళి,

"ఆయన, ఆ పిల్లాడి పుట్టుపూర్వోత్తరా లన్నీ యెరుగునుట. ఇంతాచేస్తే, ఆ అబ్బాయి తండ్రి వంట బ్రాహ్మడుటండీ! ఎందుకో ఆపరేషను చేయించుకుని, చీముపట్టిగా విషమించి, చివరికి ఆసుపత్రిలో దిక్కుమాలిన చావు చచ్చాడుట తండ్రి. ఆ అబ్బాయితల్లి మొగు డెప్పుడూ పనిపెట్టలేదుట. సినిమాతారల్లాగ

వేషాలు వేసుకుని షష్టిగడియలూ వూరమ్మట తిరుగుతూ వుండేదిటావిడ. ఒకమూల, మొగుణ్ణి ఆసుపత్రిలో కిందికి దింపుతూవుండగా, మరోమూల, ఆవిడ, నాటకశాల దగ్గర టిక్కెట్టుకోసం స్వయంగా యెగబాకుతోందిట. ఇదంతా యేకరువుపెట్టి, "ఎస్టిమేటుపట్టుకువెళ్లడం నీబతుక్కి నామోషీఅయిందా?' అని డెకాయించాట్ట ఆపెద్దమనిషి ఆపిల్లాణ్ణి. దీనిమీద రెడ్డిగారు "నువ్వికమా కక్కర్లేదు, దయచెయ్యి" అనేశారుట, బ్రాహ్మడైతే మాత్రం నీతీ జాతీ లేకపోయాక పూజిస్తారుటండీ లోకులూ ?"

సుందరమ్మకి మాట రాలేదు. కాలిబొటనవేలితో నేలమీద రాస్తూ మొగం వంచేసుకుందామె.

సుతారంగా తల పంకించుకుంటూ చూసి, రత్తమ్మ 'ఆవేళా ? మనం ఆసుపత్రిలో కలుసుకున్నామూ?" అంటూ మళ్ళీఅందుకుంది.

"అక్కణ్ణుంచి నే నింటికి వెళ్లాటప్పటికి, నా నాయన, రెండుజతల బంగారు గాజులూ, వొకరాళ్లవుంగరమూ కొనుక్కువచ్చాడు. అంతకితమే యెవరో వొకావిడ అమ్ముకుందిట అవి. మళ్ళీ పాతికరూపాయలు లాభం యిచ్చి అవిన్నీ కొనేశాడు నా నాయన. "పెళ్లిలో నీపెళ్లానికి పెట్టుకుందువుగాని దాచుకో నాయనా". అన్నాను నేను; కాని యెంత చెప్పినా నామాట వినక "నేను నాన్నని సుఖపెట్టలేకపోయాను. కనక, నీబదులూ నాన్నబదులూ నిన్నే సంతోషపెట్టాలి నేను. నా పెళ్లినాటికి నేను మళ్ళీ సంపాదించుకోలేకపోను, నువ్వే పెట్టుకో" అని గాజులూ, గోవర్ధనంగొలుసూ నేను పెట్టుకునేదాకా తొందరపెట్టాడు నా నాయన, ఇవిగో చూశారా?"

ఇలా అడుగుతూ వొకచేత గొలుసు యెత్తిపట్టుకునీ, గాజులు కనపడడానికి వొక చెయ్యి ముందుకి చాపి మరీ దగ్గరగా వెళ్లింది రత్తమ్మ; కాని సుందరమ్మ కిక్కురుమనలేదు.

రత్తమ్మకి చిరునవ్వు వచ్చింది; కాని అది ఆపుకుని, ఆమె "నేను నా నాయన మాట తీసెయ్యలేకపోయానండీ! ఉంగరం మాత్రం నా నాబలవంతాన అతనే పెట్టుకుంటున్నాడు సుమండీ! మొలిచినట్టు సరిపోయింది అతని అనామిక కది. మార్కండేయస్వామి దయవల్ల మాకిక లోటులేదు. నా నాయనకి, వెయ్యిన్నూటపదహార్లూ, వెండిచెంబూ వెండికంచమూ, పట్టుతాపితాలూ యిస్తామనీ, నాకూ నా చిట్టితల్లికీ చెరో నూటపదహార్లూ తక్కిన లాంఛనాలూ యిస్తామనీ యెవరో కాకినాడ కాలేజీలో ప్రొఫెసరుట, తన కూతుర్ని చేసుకోమంటూ నిన్ననే వచ్చారు. ఏలూరినుంచి "రేపు వస్తున్నా"మని ఆయన వుండగానే వొకప్లీడరుగారు ఉత్తరం రాశారు. తొందరయేమని మేమింకా యెవరికి మాటయివ్వలేదు. ఇద్దరుపిల్లలూ రజస్వల లయినవాళ్లేట. బంగారబొమ్మలు కూడానుట. నా నాయన పెళ్ళికి మీరు తప్పకుండా రావాలి సుమండీ! ఏదీ, నాయనా. యిలా రావోయ్! ఒకమాటు నీవుంగరం సుందరమ్మగారికి చూపించూ, బాగుందేమో చూస్తారూ" అంది కళ్లుచికిలించుకుంటూ.

సుందరమ్మ మొగం యెత్తలేదు.

ఇటయినా తిప్పలేదు.

మాట్లాడలేదు.

నుంచోనే లేదు.

ఒక్క అంగలో వెళ్ళి చిన్నకొడుకు రెక్కపట్టుకుని వొక్క గుంజుగుంజింది.

ధుమధుమలాడుతూ, వాణ్ణి బరబరా యీడ్చుకుపోతూ, రెండో అంగలో నాళంవారి సత్రం దాటేసింది.

చిరునవ్వు నవ్వుకుంటూ, తల పంకించుకుంటూ, రత్తమ్మ, చూస్తూ వూరుకుంది.

అప్పటికి తల్లిదగ్గిరికి వచ్చి తాపీమేస్త్రీ రామదీక్షితులు బి. ఏ., ఇదేమిటో తెలియక చకితుడై తల్లిని విడిచి సుందరమ్మనీ, సుందరమ్మని విడిచి తల్లిని చూస్తూ నిలిచిపోయాడు.

ఇదంతా చూసి పకపక నవ్వుతున్నట్టు జయా టాకీస్‌వారి లౌడ్‌స్పీకరు బ్రరుమంది.